సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 11 । జూలై । 2025



మత్స్యకారులు లక్షాధికారులు కావాలి

మత్స్యకారులు లక్షాధికారులు కావడానికి ప్రభుత్వం ఆదుకోవాలని ఫిషరీస్ ఫెడరేషన్ మాజీ చైర్మన్ పిట్టల రవీందర్ అన్నారు.

- 8లో ▸



వంతెనలు లేక తిప్పలు

వజ్జపల్లి తండా, యాచారం, లక్ష్మీనాయక్ తండా, పూర్యానాయక్ తండా రోడ్లలో కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.3 /22.2

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

బాధ్యతల స్వీకరణ

- మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వాల్య..
- జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా వెంకటేశ్వర్లు





కామారెడ్డి టౌన్: కామారెడ్డి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ బి వాల్య, జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ పెరుగు వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. మెడికల్ కళాశాల ఆయా విభాగాల హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లు, వైద్యులు, ఉద్యోగులు వాల్యకు స్వాగతం ప లికి సన్మానించారు. అలాగే జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది స్వాగతం పలికి సన్మానించారు.

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి



బాన్సువాడ రూరల్ : త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు సాధించి బీజేపీ సత్తాచాటాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ అన్నారు. తాడ్కోల్‌లోని రెడ్డి సంఘంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు అధ్యక్షతన బాన్సువాడ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని గురువారం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని నాయకులకు సూచనలు చేశారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన తాడ్కోల్ మాజీ సర్పంచ్ సాయిలు, బీరుగొండ, రాములు, రమేశ్‌కు కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు పోశెట్టి, లక్ష్మీనారాయణ, దొరబాబు, శంకర్‌గౌడ్, కోనాల గంగారెడ్డి, శ్రీనివాస్, వివిధ మండలాల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎంపీడీవోలకు పోస్టింగ్‌లు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఎన్నికలకు ముందు నిజామాబాద్, మెదక్ జిల్లాలకు బదిలీ అయిన ఎంపీడీవోలు ఐదుగురిని కామారెడ్డి జిల్లాకు కేటాయించగా వారికి మండలాల్లో పోస్టింగులు ఇచ్చారు. నిజామాబాద్ జిల్లా ధర్పల్లిలో పనిచేసిన బాలకృష్ణకు రాజంపేట, మెదక్ జిల్లా హవేలీఘన్‌పూర్ నుంచి వచ్చిన రవీశ్వర్‌గౌడ్‌కు పెద్ద కొడప్‌గల్, శివ్వంపేట నుంచి వచ్చిన నాగేశ్వర్‌కు రామారెడ్డి, మెదక్ నుంచి వచ్చిన రఘుకు పిట్లం, చిలిపిచేడ్ నుంచి వచ్చిన ఆనంద్‌కు బాన్సువాడ మండలాలకు పోస్టింగ్‌లు ఇచ్చారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి, కాచాపూర్ గ్రామాలకు చెందిన పలువురిని బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు గంప శశాంక్ గురువారం పరామర్శించారు. పెద్దమల్లారెడ్డిలో బీఆర్ఎస్ కార్యకర్తలు దాచుపల్లి భూమయ్య, మన్నే ప్రమీల, పెద్దోళ్ల దుబ్బవ్వ, కాచాపూర్ గ్రామానికి చెందిన సంతోష్‌రెడ్డి ఇటీవలి కాలంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గంప శశాంక్ బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ కోడూరి సాయాగౌడ్, నాయకులు ఈర స్వామి, వడ్ల బ్రహ్మచారి, వడ్ల శ్రీనివాస్, డాక్టర్ శ్రీనివాస్, పెద్దోళ్ల అనిల్, ధన్‌రాజు, స్వామి తదితరులు ఉన్నారు.


క్రీడా అకాడమీలో ప్రవేశాలకు ఎంపికలు

కామారెడ్డి అర్బన్: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ కొత్తగా ఏ ర్పాటు చేసిన హాకీ, అథ్లెటిక్స్ క్రీడా అకాడమీలలోబాలురు, బాలికల ప్రవేశాలకు ఈ నెల 15, 16 తేదీల్లో హైదరాబాద్‌లో ఎంపిక లు నిర్వహించనున్నారని జిల్లా యువజన, క్రీడల అధికారి కేఏస్ జగన్నాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. 12 నుంచి 16 ఏళ్ల లోపు క్రీడాకారులు వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

జనాభా పెరుగుదల అంతంతే..

- ఒక్కరు లేదంటే ఇద్దరే చాలంటున్న జనం
- కుటుంబాల సంఖ్య మాత్రం పెరుగుతోంది..

నేడు ప్రపంచ జనాభా దినోత్సవం



జనాభా పెరగడం కారణంగా తలెత్తే ఇబ్బందులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం పాత ముచ్చట. ప్రస్తుత పరిస్థితుల్లో జీవన వ్యయం భారీగా పెరగడం, పిల్లల చదువులు తలకు మించిన భారం కావడంతో చాలా జంటలు ఒక్కరు లేదా ఇద్దరు సంతానం చాలని నిర్ణయించుకుంటున్నారు. దీంతో జనాభా వృద్ధిశాతం తగ్గుతోంది. అయితే చాలా జంటలు పెళ్లైన కొత్తలోనే వేరు కాపురాలు పెడుతుండడంతో కుటుంబాల సంఖ్య మాత్రం పెరుగుతోంది. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

జిల్లా జనాభా

1991లో		2001లో		2011లో	
మొత్తం	7,64,241	మొత్తం	8,79,373	మొత్తం	9,74,227
పురుషులు	3,81,924	పురుషులు	4,38,634	పురుషులు	4,79,192
మహిళలు	3,82,317	మహిళలు	4,40,739	మహిళలు	4,95,035

■ 2021లో జనగణన చేపట్టలేదు. అయితే అంచనాల ప్రకారం 2025లో జిల్లా జనాభా 10,54,520 ఉంటుందని, ఇందులో పురుషులు 5,18,702, మహిళలు 5,35,818 మంది ఉంటారని అంచనా వేస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : చదువులు ఖరీదైపోవడం ఏడాదికేడాది అన్నింటి ధరలు పెరిగిపోయి కుటుంబ పోషణ భారంగా మారిన పరిస్థితుల్లో సంతానానికి పరిమితులు విధించుకుంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎక్కువ మంది పిల్లల్ని కంటే వారికి మంచి చదువు ఇవ్వలేమనే భావన పెరిగింది. దీంతో పరిమిత సంతానమే ముద్దనే అభిప్రాయం అన్ని వర్గాల్లోనూ ఏర్పడింది. దీంతో చాలా మంది సంతానం అంటే.. ఒక్కరే చాలని అంటున్నారు. కాదూ కూడదంటే ఇద్దరితో ఆపేద్దామనే భావన మెజారిటీ ప్రజల్లో ఉంది. చదువుకున్న వారే కాకుండా సామాన్య ప్రజలు కూడా చిన్న కుటుంబానికే మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా జనాభా పెరుగుదల శాతం ఏడాదికేడాది తగ్గిపోతోంది. కుటుంబాల సంఖ్య పెరిగినా, జనాభా పెరుగుదల మాత్రం ఆ స్థాయిలో కనబడడం లేదు. కామారెడ్డి జిల్లాలో 2001 జనాభా గణాంకాల ప్రకారం జనాభా వృద్ధి 15 శాతం ఉంటే, 2011 కి వచ్చేసరికి జనాభా వృద్ధి 8.8 శాతానికి పడిపోయింది. 2021లో చేపట్టాల్సిన జనాభా గణన కరోనా కారణంగా నిలిచిపోయింది. అయితే ప్రభుత్వ అంచనాల ప్రకారం గడచిన పద్నాలుగేళ్ల కాలంలో జనాభా వృద్ధి 7.5 శాతం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

కుటుంబాలకు తగ్గట్టుగా పెరగని జనాభా

2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో కుటుంబాల సంఖ్య 2,22,513 ఉండగా, 2016లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో ఆ సంఖ్య 2,77,355కి పెరిగింది. మొన్నటి సామాజిక, కుల, గణన ప్రకారం జిల్లాలో 3.08 లక్షల కుటుంబాలు ఉన్నట్టు తేలింది. 14 ఏళ్ల కాలంలో కుటుంబాల సంఖ్య దాదాపు 86 వేలు పెరిగినట్లు అర్థమవుతోంది. అయితే జనాభా మాత్రం 80 వేలు పెరిగినట్టు స్పష్టమవుతోంది. చాల కుటుంబాల్లో పెళ్లవగానే వేరుకాపురాలు పెట్టేస్తున్నారు. దీంతో కుటుంబాల సంఖ్య పెరుగుతోంది.

ఒక్కరు లేదా ఇద్దరు చాలు



ఆర్థికంగా ఉన్న వారు ఎంత మంది పిల్లలు ఉన్నా ఇబ్బందులు ఉండకపోవచ్చు. కానీ సామాన్య ప్రజలు ఎవరైనా సరే ఒక్కరు, లేదంటే ఇద్దరు సంతానం ఉండడమే మంచిది. పిల్లల చదువుల నుంచి వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు అవసరమైన ఆర్థిక పరిస్థితులు అందరికీ ఉండవు. ఒకరు లేదా ఇద్దరు పిల్లలు ఉంటేనే మేలు. – ధన్‌రాజ్ – ప్రత్యూష, ఎల్లారెడ్డి

ఉమ్మడి కుటుంబాలు అవసరం



తక్కువ మంది సంతానంతో కుటుంబాలు చిన్నగా మారిపోతున్నాయి. ఉమ్మడి కుటుంబాలు ఉన్నపుడు అందరికీ అన్ని విషయాలపై అవగాహన ఉండేది. పాత రోజుల్లో ఒక్కో కుటుంబంలో నలుగురైదుగురు సంతానం ఉండేది. ఇప్పుడు అన్నీ చిన్న కుటుంబాలే అయ్యాయి. దీంతో ఎవరికీ ఏమీ తెలియడం లేదు. – సంతోష్‌కుమార్, ఎల్లారెడ్డి

వేతనం లేని ఉపాధి



దీఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న టీఏలు (ఫైల్)

- టీఏలు, ఎఫ్ఏలకు మూడు నెలలుగా అందని జీతాలు
- ఏపీవో, సీవో సిబ్బందికి రెండు నెలలుగా..
- ఇబ్బందులు పడుతున్న సిబ్బంది

ఎల్లారెడ్డిరూరల్: ఉపాధిహామీ కూలీలకు ఉపాధి కల్పించే సిబ్బంది వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో కుటుంబాల పోషణ భారంగా మారిందని ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు(టీఏలు), ఫీల్డ్ అసిస్టెంట్లు (ఎఫ్ఏలు) ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 2,50,423 జాబ్‌కార్డులు ఉండగా వీటి పరిధిలో 4,76,500 మంది కూలీలు ఉన్నారు. వీరిలో గత జూన్ వరకు రోజుకు సగటున 42 వేల మంది కూలీలు పనులు చేశారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు 85,284 మంది కూలీలు 10 లక్షల 92 వేల పని దినాలను పూర్తి చేశారు. వీరితో జిల్లాలో 65 మంది టీఏలు, 325 మంది ఎఫ్ఏలు పనులను గుర్తించి పనులను చేయించారు. అయితే ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని టీఏలు, ఎఫ్ఏలు ఆవేదన చెందుతున్నారు. వీరితోపాటు జిల్లాలో 14 మంది ఏపీవోలు, 9 మంది ఈసీలు, 48 మంది కంప్యూటర్ ఆపరేటర్లు, 22 మంది అటెండర్లు ఉన్నారు. వీరికి సైతం గత రెండు నెలల నుంచి వేతనాలు అందలేదు. అధికారులు స్పందించి సిబ్బంది వేతనాలు అందేలా చర్యలను తీసుకోవాలని వారు కోరుతున్నారు.

మానసిక ఆవేదనకు గురవుతున్నాం



ఉపాధిహామీ సిబ్బంకి పనులు కల్పించే తమకు వేతనాలు అందకపోవడతో ఇబ్బందిగా ఉంది. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో పిల్లల పాఠశాల ఫీజులు, పుస్తకాలు, నోటు పుస్తకాలు కొనేందుకు ఇబ్బందిగా ఉంది. నెలనెలా వేతనాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. సాఫ్ట్‌వేర్ కారణంగా వేతనాలు అందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అనడం సమంజసం కాదు. సకాలంలో వేతనాలు అందని పక్షంలో తదుపరి కార్యాచరణను ప్రకటిస్తాం. – కృష్ణాగౌడ్, టీఏల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

కుటుంబం గడవడం లేదు



మూడు నెలల వేతనాలు రాకపోవడంతో కుటుంబం గడవడం ఇబ్బందిగా ఉంది. కూలీలతో పాటు మా వేతనాలు సైతం నెలనెలా అందించాలి. క్షేత్రస్థాయిలో పనులను గుర్తించి కూలీలను పని చేయిస్తున్నాం. అయినా మాకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం, అధికారులు స్పందించి వేతనాలు నెలనెలా అందేలా చర్యలు తీసుకోవాలి. – హసన్, ఎఫ్ఏల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

వేతనాలు అందుతాయి

ఉపాధిహామీ సిబ్బంది అందరికీ త్వరలోనే వేతనాలు అందుతాయి. ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సంబంధించిన వేతనాల బిల్లులు ఉన్నతాధికారులకు పంపడం జరిగింది. – సురేందర్, పీడీ, డీఆర్‌డీఏ, కామారెడ్డి

ఆనంద సందర్భాలను బాలసదనంలో గడపాలి



బాలసదనం చిన్నారులతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అధికారులు

కామారెడ్డి క్రైం : పుట్టినరోజు, పండగలు ఏవైనా ఆనంద సందర్భాలను బాలసదనం చిన్నారులతో కలిసి నిర్వహించుకోవాలని, వారిలో సంతోషాన్ని నింపాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలసదన్‌ను కలెక్టర్ గురువారం సందర్శించి వసతులను పరిశీలించారు. పిల్లలతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. బాగా చదువుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో నిలవాలని చిన్నారులకు సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాల సదనం చిన్నారులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పిల్లలకు దుప్పట్లను అందజేశారు. నూతన భవన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, డీసీపీవో స్రవంతి, సూపరింటెండెంట్ సంగమేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీకి వ్యాక్సిన్ లేదు.. నివారణ ఒక్కటే మార్గం



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి




హాజరైన డివిజన్‌లోని వివిధ శాఖల అధికారులు

బాన్సువాడ రూరల్: వర్షాకాలంలో సాధారణంగా విజృంభించే డెంగీకి వ్యాక్సిన్ అందుబాటులో లేదని, నివారణ ఒక్కటే మార్గమని బాన్సువాడ సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి అన్నారు. సీజనల్ వ్యాధుల నివారణ చర్యల్లో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో గురువారం డివిజన్‌లోని ఆయాశాఖల మండల అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. మురికి నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నిల్వ ఉన్న నీటిలో ఆయిల్‌బాల్స్ వేయాలని సూచించారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తూ, చెత్తసేకరణ సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయిస్తూ బ్లీచింగ్ పౌడర్‌తో క్లోరినేషన్ చేయాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్ చేయించాలన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం 'ఫ్రైడే డ్రైడే' ని ర్వహించాలని అధికారులకు సూచించారు. అనంత రం డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, పురోగతిపై డివిజన్‌లోని అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలతో సమీక్షాసమావేశం నిర్వహించారు. డి ప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విద్య, డీఎల్‌పీవో సత్యనారాయణరెడ్డి, ఆయా మండలాల వైద్యాధికారు లు, ఎంపీడీవోలు, ఎంఈవో, ఎంపీవోలు పాల్గొన్నారు.

ప్రాథమికంలో మెరుగు'బడి'

- ఉన్నతంలో వెనుకడుగు
- జాతీయ సాధన సర్వేలో ఆశాజనక ఫలితాలు
- గత సర్వే ఫలితాల కంటే మెరుగు
- ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ కార్యక్రమాలతో సత్ఫలితాలు



నిజామాబాద్‌అర్బన్: విద్యావ్యవస్థలో మార్పు మొదలైంది. బోధనాభ్యసన ప్రక్రియలో సత్ఫలితా లు వస్తున్నాయి. రెండేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న తొలిమెట్టు(ఎఫ్ఎల్ఎన్), లిప్(లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం) కార్యక్రమాలతో విద్యార్థులకు గుణాత్మక విద్య అందుతూ అభ్యసన ఫలితాలు మెరుగవుతున్నాయి. ఇటీవల కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన పరక్ రాష్ట్రీయ, సర్వేక్షణ(న్యాస్) సర్వే నివేదికలో ఉమ్మడి జిల్లా మెరుగైన స్థానంలో ఉంది.

సర్వే ఇలా..

ఉమ్మడి జిల్లాలో దాదాపు 180 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 2024 డిసెంబర్ 4న న్యాస్, ఎన్‌సీఈఆర్టీ సంయుక్తంగా రాష్ట్రీయ సర్వేక్షణ్–పరఖ్ సర్వేను నిర్వహించాయి. ఫలితాలను ఉదిత్, ఉదయ్, ఉన్నత్, ఉద్భవ్ అనే నాలుగు కేటగిరీలుగా వర్గీకరించి కేంద్ర విద్యాశాఖ విడుదల చేసింది. 25 శాతం కంటే తక్కువ అభ్యసన స్థాయిలను కలిగి ఉంటే ఉద్భవ్‌గా, 25–50 మధ్య ఉంటే ఉన్నతిగా, 50–75 మధ్య ఫలితాలను ఉదయ్, ఆపైన ఫలితాలు వస్తే ఉదిత్‌గా ప్రకటించారు. కేంద్రం విడుదల చేసిన ఈ ఫలితాలలో ఉమ్మడి జిల్లా ఆశాజనక స్థానం సాధించింది.

■ 3వ తరగతి ఫలితాలలో రాష్ట్రంలో కామారెడ్డి జిల్లా 9వ, నిజామాబాద్ 18వ స్థానాన్ని సాధించాయి. గత న్యాస్ సర్వే కంటే పది స్థానాలు మెరుగుపడినాయి. అలాగే ప్రైవేట్ బడుల కంటే ప్రభుత్వ బడులలో అభ్యసన సామర్థ్యాలు పెరిగినాయి. 6వ తరగతిలో భాష, గణితంలో ఉన్నతి, ఉద్భవ్ స్థాయిలో ఉండగా, సామర్థ్యాల పరంగా వెనుకబడ్డాయి. 9వ తరగతిలో అభ్యసన ఫలితాలు మెరుగయ్యాయి.

తరగతులవారీగా A¿¶ fl స్థాయి శాతం

సబ్జెక్టు/విషయం	3వ	6వ	9వ
భాష	58	53	54
గణితం	54	44	36
సైన్స్	-	-	39
సోషల్‌స్టడీస్	-	-	38

ప్రభుత్వ బడులు బలోపేతం

2022 ఆగస్టు 15 నుంచి ప్రవేశపెట్టిన తొలిమెట్టు, లిప్ కార్యక్రమాలతో ప్రభుత్వ బడులలో అభ్యసన ఫలితాలు మెరుగయ్యాయి. అలాగే డీఎస్సీ–2024, డీఎస్సీ–2008 ద్వారా జిల్లాలో నూతనంగా నియామకమైన 650 ఉపాధ్యాయులతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమై విద్యార్థులకు గుణాత్మక విద్య అందిస్తున్నాయి. కనీస అభ్యసన సామర్థ్యాలను సాధించడంతోపాటు తరగతి గది అభ్యసన ఫలితాలను సాధించేందుకు గత విద్యా సంవత్సరం నుంచి పంపిణీ చేసిన వర్క్‌బుక్‌లు దోహదపడ్డాయి.

ఉపాధ్యాయుల కృషితోనే..

ఇటీవల వెలువడిన జాతీయ సాధన సర్వేలో మంచి ఫలితాలు రావడం శుభ పరిణామం. ఉపాధ్యాయుల కృషితోనే ఇది సాధ్యమైంది. ప్రాథమిక స్థాయిలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమిస్తే ఇంకా మెరుగైన ఫలితాలు సాధిస్తాం. – అంకం నరేశ్, పీఆర్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు

'ఉపాధి'లో పారదర్శకత కోసం విజిలెన్స్ కమిటీలు



మాట్లాడుతున్న రాష్ట్ర డైరెక్టర్ నిర్మల

బిచ్కుంద(జుక్కల్): ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు చోటు లేకుండా పారదర్శకంగా చేపట్టేందుకు విజిలెన్స్ కమిటీలు వేస్తున్నామని, ప్రతి నెలా పనులను కమిటీ తనిఖీ చేస్తుందని ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ నిర్మల, పీడీ సురేందర్ అన్నారు. బిచ్కుంద మండల పరిషత్ కార్యాలయంలో 2024–25 ఈజీఎస్ పనుల సామాజిక తనిఖీ ప్రజావేదికను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో రూ.2 కోట్ల 35 లక్షల విలువైన పనులకు అధికారులు సోషల్ ఆడిట్ నిర్వహించారన్నారు. ఈజీఎస్ పనులు పర్యవేక్షణ కోసం త్వరలోనే ప్రభుత్వం విజిలెన్ కమిటీలు ఏర్పాటు చేయనుందని, అక్రమాలకు పాల్పడితే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో చేపట్టిన కొన్ని పనుల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని, మస్టర్లలో తప్పులున్నాయని సోషల్ ఆడిట్ అధికారులు తెలిపారు. అక్రమాలకు పాల్పడిన సిబ్బంది నుంచి డబ్బులు రికవరీ చేస్తామని పీడీ స్పష్టం చేశారు. క్వాలిటీ కంట్రోల అధికారులు రాఘవన్, విప్లవకుమార్, ఎంపీడీవో గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా గురుపూర్ణిమ

తాడ్వాయిలోని శబరిమాత ఆశ్రమంలో పాదుకాపూజ నిర్వహిస్తున్న పండితులు

గురుపూర్ణిమ పర్వదినాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించారు. దత్తాత్రేయ, సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్రమాల్లో గురువులకు భక్తులు పాదపూజ చేశారు. ప్రజలు తమ గురువులను భక్తిశ్రద్ధలతో కొలిచారు.

క్లుప్తంగా

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

● డీఎస్పీ శ్రీనివాసరావు



ఎల్లారెడ్డి రూరల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణంలోని వైశ్య భవన్లో నిర్వహిస్తున్న యోగా కేంద్రంలో ఆయన యోగా కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజూ యోగా చేయడం వల్ల ప్రతి ఒక్కరు ఆరోగ్యవంతులు అవుతారని అన్నారు. అనంతరం గురుపౌర్ణమిని పురస్కరించుకొని యోగ గురువు నాగరాజు గౌడ్ను శాలువాతో సన్మానించారు.

కార్యకర్తలకు బీజేపీ అండగా ఉంటుంది



ఎల్లారెడ్డి: బీజేపీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం మల్కాపూర్లో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు నర్సింలు ఇంటిని అధికారులు కూల్చి వేయడంతో కూల్చి వేసిన ఇంటిని పరిశీలించారు. అనంతరం నర్సింలుకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్పంచుగా బాధ్యతలు నిర్వర్తించిన సమయంలో నర్సింలు తన ఇల్లు కట్టుకోకుండా అందరికీ ఇళ్లు కట్టించాడని, తాను ఇల్లు కట్టుకుంటే అక్రమంగా స్థలం కబ్జా చేశారని అంటూ ఇంటిని కూల్చి వేయడం సమంజసం కాదన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షులు నీలం చిన్నరాజులు, నాయకులు బాలకిషన్, రాజేష్ తదితరులున్నారు.

కళాశాల రికార్డుల పరిశీలన

బిచ్కుంద(జుక్కల్): ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఎంత మంది అడ్మిషన్లు పొందారు.. సౌకర్యాలు ఎలా ఉన్నాయని ప్రిన్సిపాల్ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని లెక్చరర్లను ఆదేశించారు. లక్ష్యంతో ముందుకు వెళ్లాలని విద్యార్థులను సూచించారు. ప్రిన్సిపాల్ మోహన్రెడ్డి, లెక్చరర్లు ఉన్నారు.

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

గురు పౌర్ణమి సందర్భంగా గురువారం జిల్లా వ్యాప్తంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. పంచామృతాభిషేకాలు, అర్చనలు, సామూహిక పారాయం చేసి గురువు గొప్పతనాన్ని చాటారు. గురువులను సత్కరించారు. – సాక్షి నెట్వర్క్



రామారెడ్డిలో గురువులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు



తాడ్వాయిలో ఆధ్యాత్మిక గురువులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు



నెమ్లి షిరిడీ సాయి ఆలయంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పూజలు



జిల్లా కేంద్రంలో యోగాచార్యులను సన్మానిస్తున్న యోగా సెంటర్ ప్రతినిధులు



పేట్సంగెం జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువుకు సన్మానం



శెట్పల్లిలో రిటైర్డ్ టీచర్ మోహనచారికి సన్మానం



దోమకొండ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి పూజలు



బీబీపేట: యోగా గురువు బండి రాములును సన్మానిస్తున్న యోగా సమితి సభ్యులు



లింగంపేట సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నికాల్పూర్కు మరో పేరు లక్ష్మీనారాయణపురం

మీకు తెలుసా?

మండలంలో ముంపు గ్రామమైన నికాల్పూర్కు లక్ష్మీనారాయణపురం అనే మరో పేరు కూడా ఉంది. మరికొందరు జంగంపల్లి అని కూడా పిలిచేవారట.

- సుమారు 155 ఏళ్ల క్రితం పంటలకు, పశువులకు నీటి కొరత ఉందనే కారణంతో లక్ష్మీనారాయణపురం గ్రామస్తులందరూ గోదావరి ఒడ్డున నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. కొన్నేళ్లకు భూములు ముంపునకు గురికావడంతో ఎత్తయిన ప్రాంతానికి వచ్చి ఇళ్లను నిర్మించుకున్నారు.
- ఇలా పలుమార్లు వారి భూములు ముంపునకు గురికావడంతో ప్రతిసారి వారు వేరే ఎత్తయిన ప్రాంతానికి వచ్చి నివాసాలను ఏర్పాటుచేసుకున్నారు.
- మూడుసార్లు గ్రామస్తులు ఆయా ప్రాంతాల నుంచి వెళ్లిపోవడంతోనే లక్ష్మీనారాయణపురం గ్రామానికి నికాల్పూర్ అనే పేరు వచ్చినట్లు ఊరి పెద్దలు చెప్తున్నారు. నికాల్ అంటే హిందీలో వెళ్లిపోవడం అని అర్థం.
- ప్రస్తుతం గ్రామంలో 534 నివాస గృహాలు, 1200 ఎకరాల సాగుభూమి ఉంది.



నికాల్పూర్ ముఖ చిత్రం

- నికాల్పూర్ మొదటి గ్రామ సర్పంచ్గా ఆనంద్రావు 1969లో పని చేశారు.
- గ్రామంలో జంగం చెరువు, ఊర చెరువు, కొత్తకుంట అనే మూడు చెరువులు ఉన్నాయి. పాత గ్రామంలో ఓ కాలనీకి వేంకటేశ్వర పల్లె అనే పేరు ఉండేది. దానికి గుర్తుగా గ్రామస్తులు ఇటీవల ఊరి నడిబొడ్డున వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించుకున్నారు.
- పాత గ్రామంలోని హనుమాన్ ఆలయం ప్రతీ ఏటా వర్షాకాలంలో ముంపునకు గురై వేసవిలో తేలుతుంది. అప్పుడు ఊరంతా వెళ్లి పూజలు నిర్వహిస్తారు.

– దొంతేశ్వర్(ఆర్మూర్)

సమాచారం..

ఆర్మూర్: భారతదేశంలో నేరస్తులకు శిక్షలు విధించడానికి, నేరస్తుల విచారణ కోసం బ్రిటీష్ కాలంలో రూపొందించబడిన చట్టాలే 2024 వరకు కొనసాగాయి. శిక్షలు విధించడానికి 1860లో ఐపీసీ(ఇండియన్ పీనల్ కోడ్), 1973లో సీఆర్పీసీ(క్రిమినల్ ప్రొసీజర్ కోడ్), 1872లో ఐఈఏ(ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్)లను రూపొందించారు.

- ఈ చట్టాలను సవరిస్తూ 2023 డిసెంబర్ 25న కేంద్ర ప్రభుత్వం నూతన చట్టం చేసింది.
- ఐపీసీని బీఎన్ఎస్ (భారతీయ న్యాయ సంహిత)గా, సీఆర్పీసీని బీఎన్ఎస్ఎస్ (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత)గా సవరించింది. అలాగే ఐఈఏని బీఎస్ఏ(భారతీయ సాక్ష్య అధినియం)గా మారుస్తూ 2024 జూలై 1నుంచి అమలులోకి తీసుకొచ్చారు.
- ప్రస్తుతం పోలీస్స్టేషన్లలో నమోదు చేయబడ్డ వివిధ కేసులపై నూతన చట్టం ఆధారంగా కోర్టుల్లో విచారణ చేపట్టి సాక్ష్యాల ఆధారంగా న్యాయమూర్తులు నేరస్తులకు శిక్షలను ఖరారు చేస్తున్నారు.
- ఐపీసీలో 511 సెక్షన్లు ఉండగా బీఎన్ఎస్లో 358 సెక్షన్లకు కుదించారు.
- సీఆర్పీసీలో 484 సెక్షన్లు ఉండగా బీఎన్ఎస్ఎస్లో 531 సెక్షన్లకు పెంచారు.
- ఐఈఏలో 167 సెక్షన్లు ఉండగా బీఎస్ఏలో 170 సెక్షన్లకు పెంచారు.

మత్స్యకారులు లక్షాధికారులు కావాలి



మత్స్యకారులకు దిశా నిర్దేశం చేసే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మత్స్యకారులు లక్షాధికారులు కావడానికి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ మాజీ చైర్మన్ పిట్టల రవీందర్ ముదిరాజ్ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని రైతు వేదికలో మాట్లాడారు. చేపలు పట్టే హక్కు ముదిరాజ్లు, బెస్తవారికి మాత్రమే ఉందన్నారు. రాష్ట్రంలో 6,000 మత్స్య సంఘాల్లో 4,500 మత్స్య సంఘాలు ముదిరాజ్లవే కొనసాగుతున్నట్లు వెల్లడించారు. ముదిరాజ్లు హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. సభ్యత్వం లేని గ్రామాల్లో సభ్యత్వం సాధించుకోవాలన్నారు. మత్స్యకారులు మరింత అభివృద్ధి సాధించాలంటే నేడు ఆవిష్కరించిన పుస్తకం చదవాలన్నారు. ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు బట్టు విఠల్, డాక్టర్ నిజ్జన రమేష్ ముదిరాజ్, రాష్ట్ర బీసీ సంఘం కార్యదర్శి సాయిబాబా, మండల అధ్యక్షుడు సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



కామారెడ్డి క్రైం: ఇతర ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకువచ్చి యువతకు విక్రయించే ఓ వ్యక్తిని కామారెడ్డి ఎక్సైజ్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. వివరాలు ఇలా.. హైదరాబాద్కు చెందిన అహ్మద్ బిన్ అసద్ అనే వ్యక్తి కొంత కాలంగా కామారెడ్డిలో నివాసం ఉంటున్నాడు. అతడు గంజాయి ప్యాకెట్లను విక్రయిస్తుంటాడని సమాచారం రావడంతో పోలీసులు నిఘా పెట్టారు. గురువారం సాయంత్రం పట్టణ సమీపంలోని నర్సన్నపల్లి రైల్వే గేటు వద్ద అతడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 550 గ్రాముల గంజాయి పట్టుబడింది. నిందితుడిని అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సుందల్ సింగ్ తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

ఘనంగా శబరి మాత పాదుకా పూజ మహోత్సవం



హాజరైన భక్తులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారి పక్కన గల శబరి మాత ఆశ్రమంలో గురువారం పాదుకా పూజ మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గురుపౌర్ణమి సందర్భంగా ఉదయం వందలాది భక్తుల మధ్య ధ్వజారోహణ కార్యక్రమంతో ఉత్సవాలను ప్రారంభించారు. వేద పండితులు పాదుకా మహోత్సవ కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం మహాత్ములు ఉపన్యాసాలు, ప్రవచనాలు చేశారు. భజన కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు భారీగా తరలివచ్చారు. అన్నదానం చేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సబ్ కలెక్టర్కు వికలాంగుల వినతి

బాన్సువాడ: వికలాంగులకు పింఛన్లు, తెల్ల రేషన్కార్డులు ఇవ్వాలని గురువారం వికలాంగుల హక్కుల సమితి ఆధ్వర్యంలో సబ్ సబ్ కలెక్టర్ కార్యాలయం అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి జిల్లా అధ్యక్షుడు కుమ్మరి సాయిలు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడుస్తున్న దివ్యాంగులను చిన్నచూపు చూస్తోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీ ప్రకారం రూ. 6 వేల పింఛన్ ఇవ్వాలని అన్నారు. సభ్యులు దారం రాములు, సాయిరాం, గంగాధర్యాదవ్, గొడుగు కిష్టయ్య, ఫయాజ్, ప్రభాకర్, చంద్రకళ, తదితరులున్నారు.

ఎల్లారెడ్డి ఆర్డీవోగా పార్థసింహారెడ్డి



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఆర్డీవోగా పార్థసింహారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. హైద్రాబాద్ సెక్రటేరియట్లో డిప్యూటీ కలెక్టర్గా విధులు నిర్వర్తిస్తున్న పార్థసింహారెడ్డి ఎల్లారెడ్డికి ఆర్డీవోగా బదిలీపై వచ్చి ఛార్జి తీసుకున్నారు. గత నెలలో ఆర్డీవోగా విధులు నిర్వర్తించిన మన్నె ప్రభాకర్ పదవీ విరమణ పొందడంతో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి కొద్ది రోజులు ఆర్డీవోగా వ్యవహరించగా గత నెల 24న కామారెడ్డి ఆర్డీవోకు ఇన్ఛార్జిగా బాధ్యతలు అప్పగించారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోలు



ఎంపీడీవో ఆనంద్

బాన్సువాడ రూరల్: బాన్సువాడ ఎంపీడీవోగా ఆనంద్ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మెదక్ జిల్లా నుంచి బదిలీపై వచ్చిన ఆనంద్కు ఇన్ఛార్జి ఎంపీడీవో ముజాహిద్ బాధ్యతలు అప్పగించారు.

పిట్లంలో రఘు..



పిట్లం(జుక్కల్): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవోగా రఘు బాధ్యతలు స్వీకరించారు. పిట్లం ఎంపీడీవోగా పనిచేసిన కమలాకర్ బదిలీపై రెంజల్కు వెళ్లగా, ఆయన స్థానంలో మెదక్ నుంచి బదిలీపై రఘు పిట్లంకు వచ్చారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది నూతన ఎంపీడీవో రఘుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ మండల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

రాజంపేటలో బాలకృష్ణ..



రాజంపేట: రాజంపేట మండల ఎంపీడీవోగా ఎ.బాలకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ధర్పల్లి మండలంలో ఎంపీడీవోగా విధులు నిర్వహించిన బాలకృష్ణ బదిలీపై రాజంపేట మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీవో రామకృష్ణ, మండల పరిషత్ సిబ్బంది శాలువాతో సత్కరించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై గురువారం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్సై జగదీశ్ మాట్లాడుతూ...ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. పెండింగ్లో ఉన్న చలాన్లను చెల్లించాలని సూచించారు. హెల్మెట్ లేని వాహనదారులకు జరిమానాలు విధించారు.

క్రైం కార్నర్

డ్రంకెన్డ్రైవ్లో నలుగురికి జైలు

ఖలీల్వాడి: నగరంలో ఇటీవల ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 11 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారికి గురువారం ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ ఆదేశాల మేరకు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం నగరంలోని కోర్టులో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. జడ్జి వారిలో ఏడుగురికి రూ. 11500 జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. మిగిలిన నలుగురిలో ఒకరికి ఒకరోజు, ఇద్దరికి రెండు రోజులు, ఒకరికి మూడు రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

న్యూసెన్స్ కేసులో ఒకరికి..

ఖలీల్వాడి: నగరంలోని రైల్వేస్టేషన్ వద్ద బుధవారం రాత్రి మద్యం అతిగా తాగి న్యూసెన్స్ చేసిన ఒకరికి జిల్లా కోర్టు ఏడు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఒకటో టౌన్ ఎస్హెచ్వో రఘుపతి తెలిపారు. వివరాలు ఇలా.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన షేక్ ఫిరోజ్ అనే వ్యక్తి మద్యం అతిగా తాగి నగరంలో శాంతి భద్రతలకు ఆటంకం కలిగించాడు. వెంటనే అతడిని పోలీసులు అరెస్టు చేసి, గురువారం స్పెషల్ సెకండ్ క్లాస్ జడ్జి నూర్జహాన్ ఎదుట హాజరుపర్చారు. జడ్జి అతడికి ఏడు రోజుల జైలు శిక్ష విధించినట్లు చెప్పారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం అతడిని జిల్లా జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు.

తల్లిని హతమార్చిన కొడుకు


● పింఛన్ డబ్బుల కోసం ఘాతుకం

వర్ని: పింఛన్ డబ్బుల కోసం తల్లిని కొడుకు హతమార్చిన ఘటన మండలంలోని జలాల్పూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. జలాల్పూర్ గ్రామానికి చెందిన మక్కపల్లి సాయిలుకు గతంలోనే వివాహం జరుగగా భార్య అతడిని వదిలి, పుట్టింటికి వెళ్లిపోయింది. ఇంట్లో సాయిలు అతడి తల్లి సాయవ్వ(60) ఉంటున్నారు. మద్యానికి బానిసైన సాయిలు తరచూ డబ్బుల కోసం తల్లిని వేధించేవాడు. తల్లికి ఈనెల పింఛన్ డబ్బులు రావడంతో వాటిని తనకు ఇవ్వాలని సాయిలు గురువారం మధ్యాహ్నం ఘర్షణకు దిగాడు. తల్లి ససేమిరా అనడంతో అతడు బండ రాయిని తీసుకొని తల్లిపై కొట్టగా తీవ్రంగా గాయపడింది. వెంటనే స్థానికులు గమనించి ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేయగా, నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు ఎస్సై మహేష్ వెల్లడించారు.

బస్వాపూర్లో ఒకరి ఆత్మహత్య

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు భిక్కనూరు ఎస్సై దత్తు గురువారం తెలిపారు. బస్వాపూర్ గ్రామానికి చెందిన కందూరి లింగం(55) గత కొన్ని రోజులుగా మద్యానికి బానిసై, తరచు భార్య, పిల్లలతో గొడవపడేవాడు. బుధవారం రాత్రి అతడు అతిగా మద్యం తాగి, ఇంటికి వచ్చి భోజనం చేసి పడుకున్నాడు. కుటుంబీకులు గురువారం ఉదయం లేచిచూడగా అతడు ఇంటి వెనుక ఉన్న స్లాబ్కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పొదుపు డబ్బులు స్వాహా!



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని ఒడ్డేపల్లి గ్రామ బీపీఎం నిఖిత పొదుపు డబ్బులను ఖాతాల్లో జమ చేయకుండా స్వాహా చేసినట్లు తెలిసింది. సదరు బీపీఎం మూడు నెలల పాటు సెలవుపై వెళ్లడంతో ఇటీవల ఇన్చార్జి బీపీఎంగా శశికాంత్ పోస్టాఫీస్కు వచ్చాడు. అయితే ప్రతి నెలా ఆర్డీ డబ్బులు బీపీఎం నిఖితకు ఇవ్వడంతో ఖాతాబుక్కుల్లో వారికి రాసి ఇచ్చింది. డబ్బులు జమ చేసేందుకు ప్రజలు పోస్టాఫీస్కు రావడంతో ఇన్చార్జి బీపీఎం ఆన్లైన్లో తనిఖీ చేయగా తేడాలు కన్పించాయి. ప్రతి నెలా డబ్బులు కట్టినట్లు బుక్కుల్లో రాసి ఉన్నా ఆన్లైన్ నమోదు చేయకుండా స్వాహా చేసిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. డబ్బుల కోసం స్థానికులు ఎస్పీఎం, బీపీఎం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

బీటీ రోడ్డు గుంతలమయం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఉత్తునూర్–యాచారం ప్రధాన బీటీ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. ఉత్తునూర్ సొసైటీ సమీపంలో బీటీ రోడ్డుపై భారీగా గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి గుంతలు పడ్డ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఉత్తునూర్, యాచారం, లక్ష్మీనాయక్ తండా, సజ్యానాయక్ తండా, పూర్యానాయక్ తండాల ప్రజలు కోరుతున్నారు.

నియామకం



గాంధారి(ఎల్లారెడ్డి): లంబాడా హక్కుల పోరాట సమితి అధ్యక్షుడిగా పిష్కిల్ గుట్ట తండాకు చెందిన పరశురామ్ నాయక్ను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెనుకబడిన గిరిజనుల హక్కుల కోసం పోరాటం చేస్తామని, తండాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.

ఆత్మకూర్ హైస్కూల్ సందర్శన



సాక్షి ఎఫెక్ట్..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఆత్మకూర్ హైస్కూల్ను గురువారం ఎంఈవో భాస్కర్రెడ్డి సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న పాముల బెడదపై 'సాక్షి' దినపత్రికలో గురువారం 'పాఠశాలలో పాముల బెడద..!'అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. పాఠశాలను పరిశీలించారు. తరగతి గదులను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పాఠశాల చుట్టూ ప్రహరీ లేకపోవడం వల్ల పాములు, తేళ్లతో పాటు ఇతర కీటకాలు ప్రవేశిస్తున్నాయని ఉపాధ్యాయులు ఎంఈవోతో పేర్కొన్నారు. ప్రహరీతోపాటు అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా చూడాలని వారు కోరారు.

ఆర్మూర్ బస్టాండ్లో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

● డిప్యుటేషన్ బాధలే కారణం!



డ్రైవర్ షేక్హిమాం పాషా

ఆర్మూర్టౌన్: నిజామాబాద్–2 డిపోకు చెందిన షేక్ హిమాం పాషా (52) అనే డ్రైవర్ ఆర్మూర్ బస్టాండ్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన కలకలం రేపింది. వివరాలు ఇలా.. ఖమ్మం జిల్లా సత్తుపల్లి ప్రాంతానికి చెందిన షేక్హిమాం పాషాను ఖమ్మం జిల్లా నుంచి నిజామాబాద్కు ఆరు నెలల కోసం డిప్యుటేషన్పై బదిలీ చేశారు. ఆయనతో పాటు నిమాజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు మొత్తం 63 మంది ఉద్యోగులను ఆరు నెలల కోసం డిప్యుటేషన్పై బదిలీ చేశారు. కానీ తాను వచ్చి మూడు సంవత్సరాలు గడిచినా ఇప్పటి వరకు తిరిగి స్వస్థలాలకు పంపలేదని, ఈ విషయంలో ఎలాంటి న్యాయం జరగకపోవడంతో నిరాశ చెందానన్నాడు. సెలవులు కూడా ఇవ్వడం లేదని, ఉన్నతాధికారులను పలుమార్లు కలిసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. దీంతో మనస్తాపం చెందిన అతడు కరీంనగర్ నుంచి నిజామాబాద్ వస్తున్న సమయంలో ఆర్మూర్ బస్టాండ్లో తన బస్సును నిలిపి, ఎలుకల మందు తాగాడు. వెంటనే స్థానికులు అతడిని చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఆర్మూర్ డిపో అధికారులకు మరింత సమాచారం కోసం ఫోన్ చేస్తే అందుబాటులోకి రాలేరు.

తప్పులు లేకుండా ఓటరు జాబితా రూపొందించాలి

మద్నూర్(జుక్కల్) : ఓటరు జాబితాను బీఎల్వోలు తప్పులు లేకుండా రూపొందించాలని ఈఆర్వో, అదనపు కలెక్టర్ చందర్ అన్నారు. డోంగ్లీలో గురువారం బీఎల్వోలు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో బీఎల్వోల పాత్ర కీలకమని, బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముజీబ్, డీటీ శివరామకృష్ణ, ఆర్ఐ సాయిబాబా పాల్గొన్నారు.

విద్యుత్ షాక్.. జూనియర్ లైన్మన్కు గాయాలు

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ శివారులో గురువారం కృష్ణాజీవాడి జూనియర్ లైన్మన్ లక్ష్మీనారాయణ విద్యుత్ లైన్ మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదానికి స్పష్టమైన కారణాలు తెలియరాలేదు. స్థానికులు వెంటనే అతడిని కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అక్కడినుంచి హైదరాబాద్కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మోపాల్(నిజామాబాద్రూరల్): మోపాల్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై సుస్మిత తెలిపిన వివరాలు .. కామారెడ్డి జిల్లా బిచ్కుందకు చెందిన ముక్తా బాయి అంధురాలు. నగరంలోని ఆర్యనగర్లో నివాసముంటూ కంజర్లోని గురుకుల పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్గా విధులు నిర్వర్తిస్తున్నారు. కుటుంబసభ్యుల సహకారంతో పాఠశాలకు వస్తుంది. గురువారం విధులు ముగించుకుని తన అక్క కూతురు మమత సహకారంతో రోడ్డు దాటుతుండగా కాల్పోల్కు చెందిన వసంత్ బైక్తో వేగంగా వచ్చి వారిని ఢీకొట్టాడు. ప్రమాదంలో ముక్తాబాయికి గాయాలు కావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.